క్లుప్తంగా

పెదకూరపాడులో భారీ వర్షం



పెదకూరపాడు: పెదకూరపాడులో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన భారీ వర్షం పడింది. గాలులతో కూడిన వర్షానికి అమరావతి–పెదకూరపాడు రహదారి మధ్య చెట్లు విరిగి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. స్థానిక పోలీస్ స్టేషన్‌వద్ద పెద్ద చెట్టు కూలి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రేపటి నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్ననేపథ్యంలో విద్యుత్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించే పనిలో మునిగిపోయారు. మిర్చి కల్లాలలో ఆరబెట్టిన పంట మొత్తం వర్షార్పణం కావడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురౌతున్నారు.

నేడు పశువైద్య శిబిరం


అచ్చంపేట: స్థానిక పశువైద్యశాలలో సోమవారం ఉదయం 9గంటల నుంచి పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ స్వాతి ఆదివారం తెలిపారు. పశువుల్లో వచ్చే గాలికుంట వ్యాధి నివారణకు వ్యాక్సిన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. గొర్రెలు, మేకలు తదితర జీవాల్లో తరచు వచ్చే వ్యాధులు, పాల దిగుబడికి తీసుకోవలసిన పద్ధతులు తదితర విషయాలపై అవగాహన కల్పించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని మండల పశు, గొర్రెలు, మేకల పోషకులు సద్వినియోగం చేసుకోవలసినదిగా ఆమె కోరారు.

'జగనన్నే మా భవిష్యత్తు'పై అవగాహన



నకరికల్లు : రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవడమే మనందరం లక్ష్యంగా పెట్టుకొని పనిచేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. సచివాలయం కన్వీనర్‌లు, వలంటీర్లు, గృహసారథులకు ఆదివారం నకరికల్లులోని పార్టీ కార్యాలయంలో శిక్షణ తరగతిని నిర్వహించారు. ఇంటింటికి పంపిణీ చేయాల్సిన కిట్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన మూడున్నరేళ్లలో ఏప్రభుత్వం చేపట్టలేనన్ని సంక్షేమ కార్యక్రమాలు వైఎస్సార్ సీపీ చేపట్టిందన్నారు. ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి తిరిగి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినే గెలిపించాలని అడిగే హక్కు మనకే ఉందన్నారు. ఈనెల 7వతేదీ నుంచి 14 వరకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి జగనన్నే మా భవిష్యత్తు కిట్‌ను పంపిణీ చేయాలన్నారు జగనన్న నువ్వే మా నమ్మకం స్టిక్కర్‌లను గోడలకు, సెల్‌ఫోన్లకు అంటించాలన్నారు. ప్రతి ఒక్కరూ: 8296082960 నంబర్‌కు మిస్‌డ్ కాల్ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జేసిఎస్ మండల ఇన్‌చార్జి మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దూదేకుల హుస్సేన్‌బి బాషా, ఎంపీటీసీ సభ్యులు బైరెడ్డి ధనలక్ష్మి, షేక్.హుస్సేన్‌బి సలీల్, జూలకంటి సతీష్, గుంటూరు ఖాదర్, అంజిరెడ్డి, సాంబ, మారెళ్ల శ్రీనివాసరావు, శాగం చంద్రశేఖర్‌రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన గ్రామ సచివాలయ నూతన భవనం



దమ్మాలపాడు(ముప్పాళ్ళ): గ్రామాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పలు నిర్మాణాలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం నూతన భవనం అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధం చేశారు. గ్రామస్తులకు పారదర్శకంగా మెరుగైన ప్రభుత్వ సేవలందించేందుకు అన్ని వసతులు కల్పించారు. వీటితో పాటుగా గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో రాజీవ్‌విద్యామిషన్ ద్వారా రూ.60 లక్షల 30 వేలు నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించనున్నారు. రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటిరాంబాబు, నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు చేతుల మీదుగా ఈ నెల 4వ తేదీన ఆయా అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్‌జెఎమ్‌రామలింగారెడ్డి, శిరిగిరిగోపాలరావులు తెలిపారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

- మంత్రి అంబటి రాంబాబు
- స్థానిక ప్రజల హృదయాలను గెలవాలి
- గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సమష్టి కృషితో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు



సమావేశానికి హాజరైన గృహసారథులు

రాజుపాలెం: వలంటీర్లు సచివాలయ వ్యవస్థతో పరిపాలనను ప్రజల ముంగిటకు చేర్చామని ఇదే నిజమైన ప్రజల వద్దకు పాలనని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండల కేంద్రంలోని అంకమ్మతల్లి దేవాలయం పక్కన గ్రామ వలంటీర్లు, గృహసారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లకు గ్రామ సర్పంచ్ పులిబండ్ల అశోక్ అధ్యక్షతన శిక్షణ తరగతి ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం కన్నా ఈ ప్రభుత్వం మెరుగైన పాలన అందిస్తోందని గర్వంగా ప్రజలకు వివరించాల్సి అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సమష్టిగా కృషి చేస్తూ సమర్థవంతంగా ప్రభుత్వ పారదర్శక పాలన ప్రజల్లోకి తీసుకెళ్లి వారి హృదయాలను గెలవాలన్నారు. ఏడాదికి ముందుగా ఎన్నికల ప్రణాళిక సిద్ధమైందని దీనికి అనుగుణంగా మనం ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజా మద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్నలు వారికి వివరించి సమాధానాలు రాబట్టి వారికి సెల్‌ఫోన్‌కు , గోడకు జగనన్న నీవే మా నమ్మకం అనే స్టిక్కర్లు అంటించి రావాలన్నారు. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాలు గెలిస్తే అప్పటిదాకా నిద్రపోయి లేచి వచ్చాయి, వచ్చాయి గెలిచామని కంగారు పడుతున్నాడు చంద్రబాబు నాయుడు అని అంబటి విమర్శించారు. గృహసారథులే వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రథసారథులని వలంటీర్లతో సమన్వయం చేసుకుని సమగ్రంగా, సమర్థవంతంగా పనిచేస్తే గతంలో కన్నా మెరుగైన స్థానాల్లో విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతాశ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ బత్తుల సాంబశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ కొండ్రెడ్డి సుజాత, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ పులిబండ్ల అశోక్, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు తోట లక్ష్మీనారాయణ, కొండ్రెడ్డి పరమేష్, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు నేను సిద్ధం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: తనపై చేసిన ఆరోపణలకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ధీటుగా స్పందించారు. ఆదివారం క్రోసూరు ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి సంబంధించిన ఏ విషయంపైనైనా, ఎక్కడైనా, బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. తనపై ఆరోపణలు చేస్తున్న వారు చర్చకు రాగలరా అని సవాల్ విసిరారు. ఇటీవల నియోజకవర్గ అభివృద్ధి పై అమరలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రమాణం చేద్దామంటే టీడీపీ నేతలు రాలేదన్నారు. గత పదేళ్లలో అవినీతి, దొచుకోవడమే పరమావధిగా పాలన చేసిన వాళ్లు ఇప్పుడు తన పై విమర్శలు చేస్తున్నారన్నారు. మీ పదేళ్ల పాలనలో నియోజవర్గంలో ఒక్క రోడ్డు అయినా వేశారా అని ప్రశ్నించారు. ఈ నాలుగేళ్లలో కనీసం ఒక్క సమస్య మీద అయిన ఆందోళన చేశారా, అని ప్రశ్నించారు. ఉనికి కాపాడుకోవడం కోసం అప్పుడప్పుడు వచ్చి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అమరావతి- బెల్లంకొండ రోడ్డు మంజూరైన విషయం మీకు తెలియదా అని ప్రశ్నించారు. ఇసుకలారీల వల్ల రోడ్లు పాడైతున్నాయని, తానే ప్రతిపక్షపాత్ర పోషించి సీఎం దృష్టికి అమరావతి- బెల్లంకొండ డబుల్ లైన్ రోడ్డు మంజూరు చేయించానన్నారు. తాను నిజాయితీ పాలన చేస్తున్నానని, అవినీతి చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. గుడిలో ప్రమాణం చేయడానికి రమ్మంటే రాలేదు. కనీసం బహిరంగ చర్చకు రాగలరా అని సవాల్ విసిరారు. టీడీపీ పాలనలో నియోజకవర్గంలో 23 మంది చనిపోయారని, మీరు చేసిన అవినీతి వల్ల ఇప్పుడు కూడా ప్రాణాలు పోతున్నాయని మండిపడ్డారు. టీడీపీ హయాంలో ఇసుక అక్రమాలపై ఎన్జీటీలో కేసులు కూడా పెట్టారని, జరిమానా విధించిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. అమరావతి అమరలింగేశ్వరుని సాక్షిగా వచ్చే ఆదివారం 9 వ తేదీన నియోజవర్గానికి సంబంధించిన ఏ విషయమైనా తాను చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు.

మిషన్ వాత్సల్యను విధివంచితులు వినియోగించుకోవాలి

సత్తెనపల్లి: విధి వంచితులకు, ఎటువంటి ఆదరణ లేని అభాగ్యుల పిల్లలకు చేయూత నిచ్చేందుకు ప్రభుత్వం అండగా నిలిచేందుకు 'మిషన్ వాత్సల్య' ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఉమ్మడి గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అన్నారు. సత్తెనపల్లి మండలం కట్టమూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన అవగాహనలో ఆయన మాటట్లాడారు. చిన్నప్ప మాట్లాడుతూ తల్లి లేక తండ్రి లేని పిల్లలకు విద్య, వైద్యం అవసరాలు తీర్చేందుకు ఆర్థిక చేయూత అందించడానికి మిషన్ వాత్సల్య పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పాన్సర్షిప్ కల్పిస్తున్నాయన్నారు. నిరాదరణ, పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకి దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ పథకాన్ని రూపొందించారని, ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న అనాథలు, అభాగ్యులు తల్లితండ్రులను కోల్పోయిన తల్లిదండ్రులకు దూరమైన పాక్షికంగా ఉన్న అనాథలు, విడాకులు పొందిన తల్లితండ్రుల పిల్లలు, పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయిన బాలల న్యాయ ఆదరణ సంరక్షణ చట్టం 2015 ప్రకారం ఇల్లు లేని పిల్లలకు ప్రకృతి వైపరీత్యానికి గురైన బాల కార్మికులు, అక్రమ రవాణా, దాడులకు గురైన పిల్లలు, దివ్యాంగులు పిల్లలు మిషన్ వాత్సల్య పథకం ద్వారా ఆర్థిక అభివృద్ధిని పొందేందుకు ఒక్కొక్కరికి నెలకి రూ.4 వేలు చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీబీఆర్సీ సభ్యులు, తదితరులు ఉన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- స్వయం సహాయక సంఘాలకు రూ.1.03 కోట్ల చెక్కు అందజేత
- ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



స్వయం సహాయక సంఘాలకు చెక్కును అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

బెల్లంకొండ: మహిళా పక్షపాతిగా మహిళలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మహిళలు అందరూ అండగా నిలవాలని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు కోరారు. ఆదివారం మండల కేంద్రమైన బెల్లంకొండలో మూడో విడత 'వైఎస్సార్ ఆసరా' పథకం ద్వారా డ్వాక్రా మహిళలకు చెక్కుల పంపిణీ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి భారీగా వచ్చిన మహిళలు వారికి ఘన స్వాగతం పలికారు. ముందుగా వైఎస్సార్, సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో అన్ని వర్గాలతో పాటుగా మహిళలను దారుణంగా చంద్రబాబు మోసం చేశారని తెలిపారు. పాదయాత్ర సమయంలో మహిళల సమస్యలు విన్న సీఎం జగన్ ఇచ్చిన మాట తప్పకుండా మహిళల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ కరోనా కష్ట సమయంలో కూడా ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి పనిచేస్తుంటే ప్రతిపక్షాలు, కొన్ని మీడియా సంస్థలు పనిగట్టుకుని విష ప్రచారం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాల ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించి, విమర్శలు చేస్తున్నవారికి బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం మండలంలో 236 స్వయం సహాయక సంఘాలకు రూ.1.03,58,489ల చెక్కును డ్వాక్రా మహిళలకు పంపిణీ చేశారు. అనంతరం మహిళలకు కుట్టు మిషన్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మావెంకటేశ్వరరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఓర్చు సాంబశివరావు, వైస్ ఎంపీపీలు బూదాటి మరియమ్మ, షహనాజ్ బేగం, సొసైటీ ప్రెసిడెంట్ భద్రయ్య, చింతారెడ్డి సాయిరెడ్డి, మర్రి ప్రసాదరెడ్డి, నర్సిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎంపీడీఓ వెంకటరెడ్డి, ఏపీయం ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మదర్సా భవనానికి ఎమ్మెల్యే భూమిపూజ



అచ్చంపేట: ముస్లిం మైనార్టీ వర్గాలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. కస్తలలో హిదాయత్ బనాకిన్ ట్రస్ట్ ప్రతినిధి షేక్ హిదయతుల్లా ఆధ్వర్యంలో దాతల విరాళాలతో నిర్మించే మదర్సా భవన నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరలనుద్దేశించి మాట్లాడారు. నియోజకవర్గంలోని అచ్చంపేట, కస్తల, దొడ్లేరు, మాదిపాడు, క్రోసూరు, పెదకూరపాడు తదితర గ్రామాల్లో నూతన మసీదుల నిర్మాణానికి ప్రభుత్వం ఒక్కొక్కదానికి రూ.25 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని, మరికొన్నింటికి త్వరలో శంకుస్థాపనలు చేయనున్నట్లు చెప్పారు. హిదాయత్ బనాకిన్ ట్రస్ట్ ప్రతినిధి షేక్ హిదయతుల్లా ఆధ్వర్యంలో రూ.75 లక్షల వ్యయంతో బాలికలు చదువుకునేందుకు కావలసిన వసతులతో కూడిన భవనాన్ని నిర్మించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రజా ప్రతినిధిగా తాను ఎప్పుడు అండగా ఉంటానని చెప్పారు. ప్రస్తుతం గ్రామంలో 50 మంది విద్యార్థులతో మదర్సా వసతి గృహాన్ని తాత్కాలికంగా నిర్వహిస్తున్నారని, త్వరలో నియోజకవర్గ స్థాయిలో బాలికా విద్యార్థులు ఇక్కడే ఉండి చదువుకునే వెసులుబాటు కల్పించేందుకు ట్రస్ట్ సభ్యులు ముందుకువచ్చారని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ షేక్ మహబూబ్ సుభాని, వైఎస్సార్ సీపీ నాయకులు జాన్ పీరా, గ్రామపార్టీ కన్వినర్ చెన్నమల్లు రవి, అచ్చంపేట ఉప సర్పంచ్ షేక్ జాని, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఢిల్లీ ప్రజాప్రదర్శనకు సీపీఎం కార్యకర్తలు

నకరికల్లు: ఈనెల 5వతేదీన ఢిల్లీలో చేపట్టనున్న ప్రజాప్రదర్శనకు చేజర్ల గ్రామం నుంచి భారీగా తరలివెళ్తున్నట్లు కౌలు రైతుసంఘం మండల కార్యదర్శి జి.పిచ్చారావు తెలిపారు. బీజేపి చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సీపీఎం అనుబంధసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఢిల్లీకి బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు, మధ్యతరగతి ప్రజలు, ప్రభుత్వ స్కీముల్లో పనిచేస్తున్న ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తల హక్కులను కాలరాసే విధంగా బీజేపి పాలన సాగుతుందన్నారు. బీజేపి పాలనకు వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు అన్ని అనుబంధసంఘాలతో ఢిల్లీలో మహాప్రదర్శన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతుసంఘం, వ్యవసాయ కార్మికసంఘం, మహిళాసంఘం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి లబ్ధిచేకూరింది

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



అచ్చంపేటలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శంకరరావు

అచ్చంపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి లబ్ధిచేకూరిందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి అచ్చంపేట 1,2 సచివాలయాల పరిధిలో ఆయన ఇంటింటికి తిరిగి గ్రామస్తులను ఆప్యాయతగా పలకరించారు. సంక్షేమ పథకాలు ఏవిధంగా అందుతున్నాయో అడికి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ కరపత్రాలను పంపిణీ చేశారు. గత మూడున్నరేళ్ల ఏఏ కుటుంబానికి ఎంత లబ్ధిచేకూరిందో వివరించారు. సమస్యలను అడికి తెలుసుకున్నారు. సమస్యలపై అధికారులతో చర్చించారు. త్వరలో ప్రతి ఇంటికి కృష్ణానది నీటిని ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. అంతర్గత రహదారులు, సైడ్ డ్రైన్స్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. త్వరలో పనులు ప్రారంభం కాబోతున్నాయన్నారు. ఈ సందర్భంగా స్థానిక బీసీ కాలనీవాసుకు ఎమ్మెల్యే శంకరరావుకు ఘన స్వాగతం పలికారు. దుశ్శాలువాలతో సత్కరించారు. మళ్లీ జగన్‌మోహనరెడ్డి సీయం అయితేనే ఇప్పుడున్న సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, ప్రతిపక్షాల మాయమాటలు విని మోసపోవద్దని హితబోధ చేశారు. వచ్చే జనవరి నుంచి పింఛన్ దారులందరకి రూ.3వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎవ్వరైనా ఇల్లు కట్టుకునేందుకు ముందుకు వస్తే పక్కా గృహాన్ని మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, సర్పంచ్ కంబాల వీరబాబు, మాజీ సర్పంచ్ టీవీఎస్ మల్లిఖార్జునరావు, ఉప ఎంపీపీ గంగసాని బాబు, ఎంపీటిసీలు తెల్లమేకల నాగరాజు, షేక్ మోహిద్దీన్, సొసైటి అధ్యక్షులు రామిశెట్టి చిన్నయల్లమందయ్య, ఉప సర్పంచ్ షేక్ జాని, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు షేక్ సుభాని, మండల బీసీ సేన అధ్యక్షుడు షేక్ జాని, మైనారిటి నాయకులు కమల్‌సైదా పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



మట్టలతో ఊరేగింపులో పాల్గొన్న చిన్నారులు, మహిళలు

ముప్పాళ్ళ: మండలంలోని పలు గ్రామాల్లోని క్రైస్తవ సోదరులు మట్టల ఆదివారం ను ఘనంగా నిర్వహించారు. క్రీస్తు రాకను పురస్కరించుకుని స్వాగతం పలుకుతూ చిన్నారులు, మహిళలు ఈత మట్టలను పూలతో అందంగా అలంకరించి వాటితో క్రీస్తు గీతాలు ఆలపిస్తూ గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తారు. అనంతరం చర్చిల్లో జరిగే సామూహిక ప్రార్థనల్లో పాల్గొంటారు. ఇరుకుపాలెంలోని గాడ్స్‌గిఫ్ట్ మిరాకిల్ చర్చి లో చిన్నారులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా చర్చిలలో సంఘ కాపరులు క్రీస్తు సందేశాన్ని అందించారు.

పెదకూరపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం క్రైస్తవ సోదరులు మట్టల ఆదివారం వేడుకలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పెదకూరపాడులోని ఆర్సీయం సంఘస్తులు స్థానిక ఆర్సీయం పాఠశాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రదర్శనగా ముగ్గురు రాజుల దేవాలయం విచారణ గురువులు పుట్టి సుందరాజు భక్తులతో కలిసి ముగ్గురు రాజుల దేవాలయం వరకు ప్రదర్శన చేశారు.

ఆదరణ వృద్ధాశ్రమానికి పలువురు చేయూత



కూలర్, ఫ్యాన్, బియ్యం అందిస్తున్న కృష్ణ ప్రమీల

సత్తెనపల్లి: పట్టణంలోని నాగార్జున నగర్ కాలనీలో గల ఆదరణ అనాధ వృద్ధాశ్రమానికి పలువురు చేయూతను అందించారు. కొత్తూరి శ్రీనివాసరావు జ్ఞాపకార్థం ఒక కూలర్, ఒక ఫ్యాన్, 3 బియ్యం టిక్కీలను ఆయన భార్య కొత్తూరు కృష్ణ ప్రమీల, సోదరుడు ఆత్మకూరి శ్రీనివాసరావు ఆయన భార్య సాయి పూజిత ఆదివారం అందించారు. అలాగే బేలాది సతీష్, సాయి పృథ్విత రెండు బియ్యం టిక్కీలను అందించారు. అంతేగాక కొలకలూరి ప్రశాంత రాజు, నర్మదా దంపతుల పదవ వివాహ వార్షికోత్సవ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు అన్న సంతర్పణ నిర్వహించారు. దాతలకు ఆశ్రమ నిర్వాహకులు డాక్టర్ కె.ఇంద్రసేన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కె. రిషిత, పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



పరీక్ష సామగ్రి అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థుకు రోటరీ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని ఆదివారం అందించారు. సత్తెనపల్లి కి చెందిన ఎస్‌బీజీ డిగ్రీ కళాశాల వారి సహకారంతో 50 మంది విద్యార్థుకు పరీక్షకు అవసరమైన ప్యాడ్, పెన్సిల్, స్కేల్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌బీజీ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ శివారెడ్డి మాట్లాడుతూ పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు నమోదు చేయాలని ఆకాక్షించారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు పాయసంమహేష్‌బాబు, జిల్లా సమన్వయకర్త బెల్లంకొండనాగసాయిప్రసాద్, కోశాధికారి స్వామినాథన్, బాలసుబ్రమణ్యం, మాతంగిసాంబశివరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిధుల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలి

మంత్రి అంబటి రాంబాబు



రాజుపాలెం మార్కెట్ యార్డు సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి అంబటి

రాజుపాలెం: రాజుపాలెం వ్యవసాయ మార్కెట్ యార్డుకు కేటాయించిన స్థలంలో నూతన భవనాలను నిర్మించేందుకు వెంటనే పనులు చేపట్టాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో చైర్మన్ కొండ్రెడ్డి సుజాత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కార్యదర్శి ఆర్ ఆంజనేయసింగ్ మార్కెట్ యార్డు అభివృద్ధి పనులపై ప్రణాళికలు సిద్ధం చేసి సమావేశంలో ప్రవేశపెట్టారు. నూతన భవనం నిర్మించేందుకు, మరుగుదొడ్లు, అంతర రోడ్లు నిర్మించేందుకు రూ.1.07 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేయగా సభ్యులు ఆమోదించారు. రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మార్కెట్ యార్డు అభివృద్ధి చెందాలంటే నిధులు రాబట్టుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, మండల కన్వీనర వేపూరి శ్రీనివాసరావు, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతా శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ పూల ధనవంత్రి, వైఎస్సార్ సీపీ నాయకులు కొండ్రెడ్డి పరమేష్, తోట లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి 'ఆసరా'

- అప్పుల పాలయ్యామంటే..అభయం ఇచ్చాడు
- జగన్ మాట తప్పకుండా రుణం తీరుస్తున్నాడు
- బాబు మాఫీ చేస్తానని మాట తప్పాడు, మోసం చేశాడు
- మంత్రి అంబటి రాంబాబు



ఆసరా చెక్‌ను పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: డ్వాక్రా, రైతు రుణమాఫీలు చేస్తానని మాట ఇవ్వడంతో చంద్రబాబు మాటలను నమ్మి మోసపోయామని, మోసం చేశాడని... అక్క చెల్లెమ్మలు పాదయాత్రలో ఉన్న జగన్‌మోహన్ రెడ్డికి విన్నవిస్తే, చలించిపోయి అభయం ఇచ్చాడని, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విడతల వారీగా డ్వాక్రా రుణమాఫీ చేస్తానని ఇచ్చిన హామీ మేరకు మాట తప్పకుండా మడం తిప్పకుండా హామీని అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మూడో విడత ఆసరా సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మహిళలు మభ్యపెడుతూ చంద్రబాబు నాయుడు డ్వాక్రా బాకీలు తీర్చవద్దు.. మా ప్రభుత్వం వస్తే మీ అప్పులు తిరుస్తానన్నాడు. తాకట్టులో ఉన్న బంగారానికి వడ్డీ పెరిగింది గాని అప్పులు తీరకపోవడంతో పొదుపు సంఘాలు నిర్వీర్యం అయ్యాయన్నారు. జగన్‌మోహన్ రెడ్డి క్రమం తప్పకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పొదుపు సంఘాల బకాయిలను గత మూడు విడతలుగా చెల్లిస్తున్నారన్నారు. వలంటీర్ ,సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రజా సేవలను ఇంటి ముంగిటకే తీసుకొచ్చా మన్నారు. రూ.2000 ఉన్న పింఛన్‌ను పెంచుకుంటూ రూ.2,750 ఇస్తున్నామని, పింఛను అందుకుంటున్న వృద్ధులలో సంతోషాన్ని గమనించానన్నారు. వచ్చే జనవరికి రూ.3,000 అవుతుందన్నారు. గుండె ధైర్యంతో చెప్పన్నామని ఆత్మ సంతృప్తితో మీరు ఆశీర్వదించాలన్నారు ఈ ప్రభుత్వం హయాంలో అన్యాయాలు, అక్రమాలు, దోపిడీలు చేయలేదని, పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించామని మీరు గమనించి మళ్లీ మీ ముంగిటకు వచ్చినప్పుడు మీరు మమ్మల్ని ఆదరించాలని, ఆశీర్వదించాలని కోరారు. సత్తెనపల్లి పట్టణంలోని 702 సంఘాలకు రూ. 5, 68,43, 456 ల చెక్కును పంపిణీ చేశారు. ఇంత మొత్తంలో ఆయా సంఘాల ఖాతాలో నగదు జమ అవుతుందని వివరించారు. ముందుగా సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా మహిళా నాయకురాలు డాక్టర్ గీత హసంతి, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ, వైస్ చైర్మన్ లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరావు నాయక్, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, పలు వార్డుల కౌన్సిలర్లు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, పొదుపు సంఘాల సభ్యులు, మెప్మా సీసీలు తదితరులు ఉన్నారు.